క్లుప్తంగా

అయ్యప్పమాల ఎంతో పవిత్రమైనది



మాలధారణను స్వీకరించిన అయ్యప్పస్వాములు

కుల్కచర్ల: అయ్యప్పమాల ఎంతో పవిత్రమైనదని మండల అయ్యప్పసేవా సమితి అధ్యక్షుడు పటోళ్ల వెంకట్రామిరెడ్డి అన్నారు. బుధవారం పలువురు స్వాములు మండలంలోని బండవెల్కిచర్ల గ్రామ పరిధిలోని శ్రీ పాంబండ రామలింగేశ్వర దేవస్థానంలో అయ్యప్ప మాలను ధరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అయ్యప్పమాలధారణతో ప్రశాంతత, మానసిక పరివర్తనను పొందుతారని చెప్పారు. కార్యక్రమంలో గురుస్వాములు ఈశ్వరయ్యస్వామి, శివకుమార్ స్వామి, శ్రీశైలం, స్వాములు సంగయ్య, ప్రేంకుమార్, నితిన్‌కుమార్, నవీన్‌కుమార్ తదితరులు మాలధారణ స్వీకరించారు.

నేటి నుంచి ఆంజనేయ స్వామి మహోత్సవాలు

పెద్దేముల్: మండల పరిధిలోని గాజీపూర్ గ్రామంలో ఆంజనేయస్వామి దేవాలయ పునర్ నిర్మాణ మహోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 16వ తేదీ గురువారం కలశ పూజ, 17వ తేదీ శుక్రవారం ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమం ఉంటుందన్నారు. 18వ తేదీ శనివారం సీతారాముల కల్యాణం నిర్వహించనున్నరని తెలిపారు.

నేడు తాండూరులో కాంగ్రెస్ ప్రచారం

తాండూరు రూరల్: తాండూరు మండలంలో గురువారం కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు జెన్నె నాగప్ప ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గురువారం ఉదయం సిరిగిరిపేట్, ఐనెల్లి, కోత్లాపూర్, మల్కాపూర్, వీరారెడ్డిపల్లి, మిట్టబాసుపల్లి, గుంతబాసుపల్లి, సంకిరెడ్డిపల్లి, కోటబాసుపల్లి గ్రామాల్లో ప్రచారం ఉంటుందన్నారు. ప్రచారానికి ఎమ్మెల్యే అభ్యర్థి మనోహర్‌రెడ్డి పాల్గొంటారని చెప్పారు.

బాల్యం పునాదుల మీదనే భవిష్యత్తు

- టీవీవీ రాష్ట్ర కార్యదర్శి రవీందర్‌గౌడ్



విద్యార్థులతో రవీందర్‌గౌడ్

బొంరాస్‌పేట: భవిష్యత్తు అనేది బాల్యం పునాదుల మీదనే ఉంటుందని, చిన్నప్పుడే కలగనాలని తెలంగాణ విద్యావంతుల వేదిక (టీవీవీ)రాష్ట్ర కార్యదర్శి రవీందర్‌గౌడ్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని పూర్యానాయక్‌తండా ప్రాథమిక పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా పాఠశాలకు చెందిన 10మంది విద్యార్థులు ఉపాధ్యాయులుగా పాఠాలు బోధించి, అధికారులుగా ఒకరోజు విధులు నిర్వహించారు.

జనసేనకు గాజు గ్లాసు గుర్తు కేటాయింపు

తాండూరు టౌన్ : తాండూరు అసెంబ్లీ జనసేన అభ్యర్థికి గాజు గ్లాసు గుర్తును ఎన్నికల రిటర్నింగ్ అధికారి శ్రీనివాస్‌రావు కేటాయించారు. జనసేన అభ్యర్థిగా తొలి సెట్ నామినేషన్ వేసిన రోజు నేమూరి శంకర్‌గౌడ్‌ను ఎన్నికల రిటర్నింగ్ అధికారి స్వతంత్ర అభ్యర్థిగా పరిగణించారు. అయితే, రాష్ట్రంలోని 32 నియోజకవర్గాల్లో పోటీ చేయనున్నట్లు జనసేన పార్టీ రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు దరఖాస్తు చేసుకుంది. అయితే బీజేపీ -జనసేన పొత్తుతో తాండూరు స్థానాన్ని జనసేనకు కేటాయించారు. 32 నియోజకవర్గాల్లో తాండూరు పేరు లేదని, జనసేన అభ్యర్థిని స్వతంత్ర్య అభ్యర్థిగా గుర్తించారు. తాజాగా బి-ఫామ్, ఏ-ఫామ్ (అన్ని నియోజకవర్గాల్లో పోటీ చేస్తున్నట్లు) సమర్పించడంతో పాటు ఎన్నికల కమిషన్‌కు తాండూరులో సైతం బరిలో ఉంటున్నట్లు దరఖాస్తు చేసుకున్నారు. దీంతో నామినేషన్ ఉపసంహరణలు పూర్తయిన వెంటనే జనసేన అభ్యర్థికి గాజుగ్లాసు గుర్తు కేటాయించారు.

పరిగి బరిలో 15మంది అభ్యర్థులు

పరిగి: పరిగి అసెంబ్లీ స్థానానికి ఈనెల 10వ తేదీ వరకు 26 మంది 48 నామినేషన్లు దాఖలు చేశారు. అందులో 11 మంది నామినేషన్లను వివిధ కారణాలతో తిరస్కరించారు. బుధవారం నామినేషన్ల ఎవరూ ఉపసంహరించుకోకపోవడంతో పరిగి బరిలో మొత్తం 15 మంది ఉన్నట్లు ఆర్ఓ విజయకుమారి తెలిపారు. ప్రధాన పార్టీలైన బీజేపీ అభ్యర్థి మారుతికిరణ్, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి టి రామ్మోహన్‌రెడ్డి, బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల మహేశ్‌రెడ్డి, బీఎస్పీ పార్టీ అభ్యర్థి ఆనందంతో పాటు మరో 9 మంది వివిధ పార్టీల అభ్యర్థులు, స్వతంత్ర అభ్యర్థులు బరిలో ఉన్నారు. వారికి గుర్తులు కేటాయించినట్లు అధికారులు తెలిపారు.

ఉచిత కరెంట్ ఘనత కాంగ్రెస్‌దే

పట్టణ అధ్యక్షుడు అర్థ సుధాకర్ రెడ్డి



ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

వికారాబాద్ అర్బన్: ఉచిత కరెంట్ ఇచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని, ఒకేసారి రైతు రుణమాఫీ చేసింది కూడా కాంగ్రెస్సేనని ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు అర్థ సుధాకర్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మున్సిపల్ చైర్‌పర్సన్ చిగుళ్లపల్లి మంజుల, మాజీ వైస్‌చైర్మన్ రమేష్‌కుమార్‌లతో కలిసి గంగారం, సాయిబాబ కాలనీలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులకు కాంగ్రెస్ పార్టీ ఒకేసారి రుణమాఫీ చేసిందని గుర్తు చేశారు. కేసీఆర్ రుణమాఫీ చేస్తానని నాలుగున్నర ఏళ్లు నాన్చి ఒక లక్ష రూపాయలకు ఒక రూపాయి ఎక్కువ ఉన్నా రుణమాఫీ చేయడం కుదరదని చెప్పారని విమర్శించారు. దీంతో వేల మంది రైతులకు రుణమాఫీ కాలేదని చెప్పారు. కేసీఆర్ మాటలను నమ్మి మరోసారి మోసపోవద్దని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఆరు గ్యారంటీ పథకాలను పేదలకు అందిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ ముక్తార్ షరీఫ్, కౌన్సిలర్ చందర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఐదేళ్లుగా రుణమాఫీ చేయలేదు



ప్రచారం చేస్తున్న నరోత్తంరెడ్డి తదితరులు

మోమిన్‌పేట: రైతు పక్షపాతి అంటున్న బీఆర్ఎస్ ప్రభుత్వం ఐదేళ్లుగా రైతులకు రుణమాఫీ చేయలేదని జిల్లా కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నరోత్తం రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం మండలంలోని వెల్‌చాల్ గ్రామంలో ఆరు గ్యారంటీ పథకాలపై ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత సాధారణ ఎన్నికల్లో రూ.లక్షలోపు రైతులకు రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చిన కేసీఆర్ ప్రభుత్వం ఇప్పటికీ అమలు చేయలేకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. అప్పటి హామీలు అమలు చేయకుండా, ప్రస్తుతం ఇస్తున్న హామీలను ఎలా అమలు చేస్తారని ప్రశ్నించారు. ప్రజలు బీఆర్ఎస్‌పై పూర్తి వ్యతిరేకతతో ఉన్నారని చెప్పారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు శంకర్, నాయకులు మహేందర్ రెడ్డి, సురేందర్, జిల్లా నాయకుడు సుభాశ్‌గౌడ్, చంద్రయ్య, మాణయ్య, ఒగ్గు మల్లయ్య ఆయా గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

మా నాన్నను గెలిపించండి



కోట్‌మర్పలిలో ప్రచారం చేస్తున్న అనున్య

మర్పల్లి: 30న జరిగే శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మాజీ మంత్రి గడ్డం ప్రసాద్ కుమార్‌ను ఆశీర్వదించి గెలిపించాలని ప్రసాద్‌కుమార్ కూతురు అనన్య విజ్ఞప్తి చేశారు. బుధవారం మండలంలోని కోట్‌మర్పల్లిలో పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు నర్సింహ్మారెడ్డి బ్లాక్-2 అధ్యక్షుడు మలకనెల్లి కృష్ణారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్, ఎంపీటీసీ స్వప్న వెంకట్‌రెడ్డిలతో కలిసి ఆమె ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తమ తండ్రి ప్రసాద్‌కుమార్‌ను రాజకీయంగా ఆదరించిన కోట్‌మర్పల్లి గ్రామాన్ని ఎప్పటికీ మరువలేమన్నారు. పార్టీ అధికారంలోకి వస్తే మేనిఫెస్టోలోని ఆరు గ్యారంటీల అమలుపై ఆమె ప్రజలకు అగాహన కల్పించారు. నీళ్లు, నిధులు, నియామకాల కోసం కొట్లాడి, అమరుల త్యాగ ఫలితంగా సోనియాగాంధీ ఇచ్చిన రాష్ట్రంలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు ఇంతవరకు సాగు నీటికి నీళ్ల లేవని, గ్రామాల్లో ఎలాంటి అభివృద్ధి జరగలేదని ఆరోపించారు. అలాగే, నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. హస్తం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు రవీందర్, జిల్లా నాయకులు శంకరయ్యగౌడ్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మర్రి లక్ష్మారెడ్డి, సురేష్, రఫీ, రాచన్న, జిల్లా ఉపాధ్యక్షుడు ప్రభాకర్, కార్యదర్శి సంజీవ రెడ్డి, నాగేశ్, మండల ఉపాధ్యాక్షుడు గోపాల్, జిల్లా సీనియర్ నాయకులు ఉన్నారు. ఈ సందర్భంగా తిమ్మాపూర్ గ్రామానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు అనన్య సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు.

ప్రతి ఉద్యోగికి బదిలీ తప్పనిసరి



రాములును సన్మానిస్తున్న పీఆర్టీయూ నేతలు

కుల్కచర్ల: ప్రతి ఉద్యోగికి బదిలీ తప్పనిసరని పీఆర్టీయూ మండల అధ్యక్షుడు వెంకటయ్య, ప్రధాన కార్యదర్శి బస్వరాజులు వ్యాఖ్యానించారు. బుధవారం మండలంలోని బండవెల్కిచర్ల జెడ్పీ పాఠశాలలో బదిలీపై వెళ్లిన గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు రాములును సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉత్తమ ఉద్యోగికి ఎక్కడికెళ్లినా గుర్తింపు, గౌరవం లభిస్తాయని, విద్యార్థుల ఉన్నతికి కృషి చేసిన ఉపాధ్యాయులను విద్యార్థులు జీవితాంతం గుర్తించుకుంటారని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పెంటయ్య, వెంకటయ్య, శేఖర్, రాములు, సీఆర్పీ కృష్ణ ఉన్నారు.

నోట్ పుస్తకాల అందజేత



నోట్ పుస్తకాలు అందజేసిన సభ్యులు

కేశంపేట: మిత్రుడి జ్ఞాపకార్థం విద్యార్థులకు నోట్ పుస్తకాలను అందజేశారు. బోధునంపల్లి గ్రామంలో వడ్డేమోని ఆనంద్ వర్ధంతి సందర్భంగా శ్రీరామ్ యూత్ సభ్యులు, తోటి మిత్రులు విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హరీశ్, విజయ్, కుమార్, చింటు, వంశీ, గణేశ్, విష్ణు, సాయి తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యాలు ఎంచుకోవాలి

- సీబీఐ మాజీ డైరెక్టర్ లక్ష్మీనారాయణ



విద్యార్థులతో మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

హయత్‌నగర్: విద్యార్థులు ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకుని ఆ దిశగా కష్టపడాలని సీబీఐ మాజీ డైరెక్టర్ జేడీ లక్ష్మీనారాయణ లన్నారు. బుధవారం హయత్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన 'వ్యక్తిత్వ వికాసం' అనే కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, మాదకద్రవ్యాలు, జల్సాల జోలికి పోరాదని సూచించారు. ఆడపిల్లలు సామాజిక మాధ్యమాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. చదువుతో పాటు సంస్కారం నేర్చుకోవాలని తల్లిదండ్రులు, గురువులు, పెద్దలపై గౌరవంతో ఉండాలన్నారు. నూతనంగా ఓటుహక్కును పొందిన విద్యార్థులు సరైన అభ్యర్థిని ఎంచుకోవాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ జ్యోత్స్న ప్రభ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి చింతల రాకేష్ భవానీ సమన్వయకర్తగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్‌యాదవ్, డాక్టర్ జాహెదాబేగం, ఉపేంద్ర, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉన్నతమైన విద్యను అందించడమే లక్ష్యం

ప్రధానోపాధ్యాయుడు శివప్రసాద్



విద్యార్థులతో ఉపాధ్యాయులు

దోమ: విద్యారులకు ఉన్నతమైన విద్యను అందించడమే లక్ష్యంగా ముందు సాగుతున్నామని క్రాంతి విద్యాలయ ప్రధానోపాధ్యాయులు శివప్రసాద్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో క్రాంతి విద్యాలయంలో స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలను బోధించారు. అనంతరం ప్రధానోపాధ్యాయుడు శివప్రసాద్ మాట్లాడుతూ.. పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవం జరపడంతో ద్వారా విద్యార్థుల్లోని ప్రతిభ వెలుగుచూస్తుందన్నారు. ప్రతి విద్యార్థి ఉపాధ్యాయుడిగా మారి తోటి విద్యార్థులకు విద్యను బోధించడం ద్వారా వారిలోని నైపుణ్యత తెలుస్తుందన్నారు. అందుకు అనుగుణంగా ఉపాధ్యాయులు విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కుమార్, యాదయ్య, మంజుల, నవనీత, సరళ, మోసిన్, అస్మ, ఫరాన, స్నేహ, శ్వేత, విద్యార్థులు పాల్గొన్నారు.

వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరి



టీకాలు వేస్తున్న పశువైద్య సిబ్బంది

షాబాద్, రేగడిదోస్వాడ పశువైద్యాధికారులు డాక్టర్ స్రవంతి, డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి షాబాద్: రైతులు మూగ జీవాలకు అమ్మతల్లి వంటి వ్యాధులు రాకుండా ఉండేందుకు తప్పనిసరిగా వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని షాబాద్, రేగడిదోస్వాడ పశువైద్యాధికారులు డాక్టర్ స్రవంతి, డాక్టర్ చంద్రశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం తాళ్లపల్లి, మద్దూరు, సాయిరెడ్డిగూడ, లింగారెడ్డిగూడ గ్రామాల్లో సిబ్బందితో కలిసి మూగ జీవాలకు అమ్మతల్లి టీకాలు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీవాలకు వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల రైతులు జాగ్రత్తలు పాటించాలని చెప్పారు. మండలంలోని అన్ని గ్రామాల్లో గొర్రెలు, మేకలకు అమ్మతల్లి నివారణా టీకాలు వేయనున్నట్లు తెలిపారు. ఆయా గ్రామాల్లో రైతులు అందుబాటులో ఉండి జీవాలకు టీకాలు వేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

యువతరమా.. నవతరమా..

- యువ ఓటర్లే కీలకం
- కొత్త ఓటర్లు 14,039 మంది
- గెలుపోటముల్లో వీరిదే కీలక పాత్ర
- యువతను ఆకట్టుకునేందుకు అభ్యర్థుల పాట్లు



హుడాకాంప్లెక్స్: యువతరమా.. నవతరమా ఇదే అదును కదలిరమ్ము... అని ఓ కవి యువతను మేల్కొల్పారు. ప్రతి సార్వత్రిక ఎన్నికల్లో యువ ఓటర్లు కీలకంగా వ్యవహరిస్తున్నారు. ఈ ఎన్నికల్లో కూడా ఎవరిని అసెంబ్లీ పంపాలనే నిర్ణయం యువతీయువకుల చేతుల్లోనే ఉంది. ఆయా పార్టీల అభ్యర్థుల గెలుపోటముల్లో వారిదే కీలకపాత్ర. అందుకే వీరిని ప్రసన్నం చేసుకునేందుకు అన్ని పార్టీలో పోటీ పడుతున్నాయి. మహేశ్వరం నియోజకవర్గంలో కొత్తగా 14,039 మంది ఓటు హక్కును నమోదు చేసుకున్నారు. వీరంతా తొలిసారిగా ఓటు హక్కును వినియోగించుకోబోతున్నారు. అదే విధంగా 20 నుంచి 29 ఏళ్ల వయసు వారు 11,213 మంది, 30 నుంచి 39 ఏళ్ల వయసు కలిగిన 1,66,578 మంది ఓటర్లు ఉన్నారు. వీళ్లంతా నియోజకవర్గంలో గెలుపోటములను నిర్దేశించే స్థాయితో ఉన్నారు. అందుకే వీరిని మచ్చిక చేసుకొనే పనిలో అభ్యర్థులు బిజీగా ఉన్నారు. బీఆర్ఎస్ తరఫున సిట్టింగ్ ఎమ్మెల్యే సబితారెడ్డి బరిలో ఉండగా, ప్రతిపక్ష కాంగ్రెస్ నుంచి మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి పోటీ చేస్తున్నారు. ఇక బీజేపీ నుంచి అందెల శ్రీరాములు మరోసారి తన అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు సిద్ధమయ్యారు. ప్రస్తుతం మూడు ప్రధాన పార్టీలు హోరాహోరీగా పోరాడుతున్నాయి. ఈ ఎన్నికల్లో ఎవరు గెలిచినా స్వల్ప మెజార్టీతో గెలుస్తారనే విశ్లేషణలు వస్తున్నాయి. ముఖ్యంగా కొత్త ఓటర్లు ఎటు వైపు మొగ్గు చూపితే.. ఆ పార్టీ అభ్యర్థికే విజయవకాశాలు ఎక్కువగా ఉన్నాయనే చర్చ నియోజకవర్గంలో జోరుగా సాగుతోంది. అందువల్ల కొంతమంది అభ్యర్థులు బర్త్‌డే వేడుకల పేరుతో వారికి విందులు ఏర్పాటు చేస్తున్నారు. మరికొంత మంది హామీలు గుప్పిస్తూ యువతను ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నారు.

నియోజకవర్గంలో వయసు గ్రూపు వారీగా ఓటర్లు

వయసు వారీగా	పురుషులు	మహిళలు	థర్డ్ జెండర్లు	మొత్తం
18 నుంచి 19 ఏళ్లు	8036	6003	-	14,039
20 నుంచి 29 ఏళ్లు	51956	49238	19	11,213
30 నుంచి 39 ఏళ్లు	82814	83745	19	1,66,578
40 నుంచి 49 ఏళ్లు	61461	56498	20	1,17,979
50 నుంచి 59 ఏళ్లు	39179	35863	05	75,047
60 నుంచి 69 ఏళ్లు	22903	20439	02	43,344
70 నుంచి 79 ఏళ్లు	11433	9923	02	21,358
80 ఏళ్లు పైబడిన వారు	3421	3598	-	7,019
మొత్తం	2,81,203	2,65,307	67	5,46,577

షాద్‌నగర్ బరిలో 14 మంది



నామినేషన్ ఉపసంహరణ పత్రాలు అధికారికి అందజేస్తున్న రాజేశ్వర్



చేవెళ్ల: నామినేషన్ విత్‌డ్రా చేసుకుంటున్న కాంగ్రెస్ రెబల్ అభ్యర్థి వసంతం

- ఎన్నికల బరిలో 14 మంది అభ్యర్థులు
- ఏడుగురి నామినేషన్ల ఉపసంహరణ
- హోరాహోరీగా సాగనున్న ప్రచారం

షాద్‌నగర్: అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ ముగిసింది. బరిలో నిలబడే అభ్యర్థులు ఎవరో తేలిపోయింది. దీంతో షాద్‌నగర్ ఎన్నికల ప్రచారం హోరా హోరీగా సాగనుంది. ఈ సారి ఎన్నికలు రసవత్తరంగా మారాయి. నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ ముగియడంతో అభ్యర్థులు తమ అస్త్రశస్త్రాలను ఉపయోగించి ప్రచారంలో నిమగ్నం కానున్నారు. దీంతో షాద్‌నగర్‌లో బిగ్ ఫైట్ తప్పదు.

బరిలో 14మంది..

ప్రస్తుతం జరగనున్న ఎన్నికల నేపథ్యంలో షాద్‌నగర్ నియోజవర్గ స్థానానికి ప్రధాన పార్టీల అభ్యర్థులతో పాటు మొత్తం 24 మంది అభ్యర్థులు తమ నామినేషన్లను దాఖలు చేశారు. అయితే నామినేషన్ల పరిశీలన, ఉపసంహరణల అనంతరం 14 మంది బరిలో నిలిచారు. బీఆర్ఎస్ నుంచి అంజయ్య యాదవ్, కాంగ్రెస్ నుంచి వీర్లపల్లి శంకర్, బీజేపీ నుంచి అందెబాబయ్య, ఆల్‌ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ నుంచి పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి, బీఎస్పీ నుంచి ప్రశాంత్‌కుమార్, విద్యార్థుల రాజకీయ పార్టీ నుంచి వినయ్‌కుమార్, ధర్మసమాజ్ పార్టీ నుంచి మంచాల భిక్షపతి, స్వతంత్ర అభ్యర్థులుగా తుప్పుడు నర్సయ్య, మంచాల చంద్రమౌళి, నర్సింహ్మా రుస్తుం, అందారి అంజయ్య, రాఘవేందర్, ఆల్ ఇండియా సమతా పార్టీ నుంచి రహముద్దీన్, జై స్వరాజ్ పార్టీ నుంచి మహ్మద్ ఖాజా ముఫిజుద్దీన్‌లు బరిలో నిలిచారు.

ఉపసంహరించుకున్నది వీరే...

నామినేషన్లు వేసి ఉపసంహరించుకున్న వారిలో అందె రాజేశ్వర్, సింగపాగ శివకుమార్, ఆలుగడ్డ ప్రవీణ్, ఆలుగడ్డ ఇందిర, పల్లె సత్యనారాయణరెడ్డి, మఠం శశిధర్, ఎమ్మె సత్యనారాయణలు ఉన్నారు.

ప్రచారంలో పాల్గొననున్న అభ్యర్థులు..

షాద్‌నగర్‌లో ప్రచారం హోరా హోరీగా కొనసాగుతున్నాయి. గ్రామాల్లో ఆయా పార్టీల అభ్యర్థులు విస్తృతంగా పర్యటనలు కొనసాగిస్తున్నారు. గ్రామీణ ప్రజలను ఆకట్టుకునే విధంగా తమ ప్రచారాలు నిర్వహిస్తూ ముందుకు సాగుతున్నారు. రాజకీయ సమీకరణల్లో భాగంగా ప్రత్యర్థి పార్టీలోని బలహీనతలను ఆసరా చేసుకుంటూ అభ్యర్థులు ముందుకు సాగుతున్నారు. ఉదయం మొదలు రాత్రి వరకూ క్షణం తీరిక లేకుండా అభ్యర్థులు విస్తృతంగా పర్యటనలు కొనసాగిస్తూ ప్రజల మధ్యనే ఉంటున్నారు. అయితే ఈ ఎన్నికల్లో విజయం సాధించేందుకు హోరాహోరీగా ప్రచారం నిర్వహిస్తున్నారు. అయితే ఈ ఎన్నికల్లో గెలుపెవరిని వరిస్తుందో వేచి చూడాల్సిందే.

చేవెళ్లలోమూడు..

చేవెళ్ల: అసెంబ్లీ ఎన్నికల నామినేషన్‌ల ఉపసంహరణ ముగిసింది. బుధవారం నామినేషన్‌ల ఉపసంహరణ చివరి రోజున ముగ్గురు అభ్యర్థులు నామినేషన్లను ఉపసంహరించుకున్నట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి సాయిరాం తెలిపారు. నామినేషన్ల స్క్రూటీ్న తరువాత 15 మంది అభ్యర్థులు ఉండడంతో అందులో నుంచి ముగ్గురు అభ్యర్థులు విత్‌డ్రా చేసుకున్నారు. దీంతో చేవెళ్ల అసెంబ్లీ ఎన్నికల బరిలో 12 మంది అభ్యర్థులు ఉన్నట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి సాయిరాం తెలిపారు. విత్‌డ్రాల చివరి రోజున కాంగ్రెస్ రెబల్ అభ్యర్థి సున్నపు వసంతం, స్వతంత్ర అభ్యర్థి కాలె శ్రీకాంత్, అలయన్స్ ఆఫ్ డెమోక్రటిక్ రీఫామ్స్ పార్టీ అభ్యర్థి బేగరి రాఘవేందర్ విత్‌డ్రా చేసుకున్నారు.

ఆడబిడ్డలా ఆదరించండి

కందుకూరు: ఆడబిడ్డలా తనను ఆదరించి మరోసారి గెలిపించాలని బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి సబితారెడ్డి అభ్యర్థించారు. కులం, మతం పేరుతో ఓట్ల కోసం వచ్చే పార్టీల మాయమాటలు నమ్మి మోసపోవద్దని, కారు గుర్తుకు ఓటు వేసి మరోసారి కేసీఆర్ పాలన వచ్చేలా ఆశీర్వదించాలని కోరారు. బుధవారం మండల పరిధిలోని 11 గ్రామాల్లో ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సబితారెడ్డి మాట్లాడారు. అన్ని వర్గాల అభివృద్ధే లక్ష్యంగా బీఆర్ఎస్ పార్టీ పని చేస్తుందన్నారు. తొమ్మిదిన్నర ఏళ్ల కేసీఆర్ పాలనలో సామాజిక పెన్షన్లు, కల్యాణలక్ష్మి, రైతుబంధు, మిషన్‌భగీరథ లాంటి ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేశారని గుర్తు చేశారు. రూ.660 కోట్లతో శంషాబాద్ మీదుగా కందుకూరు, ముచ్చర్ల గేట్ వరకు మెట్రో రైలు ఏర్పాటు చేయనున్నారని, మీర్‌ఖాన్‌పేట వద్ద 450 పడకల ఆస్పత్రి, కళాశాల ఏర్పాటు కానున్నాయని తెలిపారు. అభివృద్ధి, సంక్షేమాన్ని సమానంగా అమలు చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని కొనియాడారు. లావణ్య పట్టాలకు అన్ని హక్కులు కల్పిస్తామని, దీంతో ఆ భూములున్న పేదలకు లబ్ధి చేకూరుతుందని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్.సురేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మన్నే జయేందర్, మహిళా అధ్యక్షురాలు ఇందిర, జయమ్మ రాజు, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మేఘనాథ్ రెడ్డి, నియోజకవర్గం ఉపాధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలు అమృతంతో సమానం



నర్సప్పగూడలో బాలింతతో మాట్లాడుతున్న విజయలక్ష్మి

నందిగామ: తల్లిపాలు శిశువులకు అమృతం లాంటిదని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్ఓ విజయలక్ష్మి సూచించారు. మండలంలోని నర్సప్పగూడను బుధవారం ఆమె సందర్శించారు. విజయలక్ష్మి మాట్లాడుతూ ఈ నెల 15 నుంచి 21వ తేదీ వరకు జాతీయ నవజాత వారంగా కేంద్ర ప్రభుత్వం గుర్తించిందని అన్నారు. ఈ వారం రోజు ల్లో అప్పుడే పుట్టిన బిడ్డల సంరక్షణ, ఆరోగ్య పరిరక్షణ గురించి వారి తల్లులకు వివరించాలన్నారు. పిల్లలకు స్నానం చేయించే విధానం, పాలు పట్టే విధానం, దుస్తులు గురించి తల్లులు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. కాన్పు అయిన అరగంట తరువాత శిశువుకు ముర్రుపాలు తాగించాలని చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ హరికిషన్, డాక్టర్ జాన్సీ, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు, సూపర్‌వైజర్ రవికుమార్, ఏఎన్ఎం రేణుక తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి చెక్కు అందజేత



బాధిత కుటుంబానికి చెక్కు అందజేస్తున్న బ్యాంకు అధికారులు

కొందుర్గు: చౌదరిగూడలో టైలర్ దుకాణం నడుపుకుంటూ జీవనం సాగిస్తున్న శ్రీనివాసు ఇటీవల ప్రమాదవశాత్తు మృతిచెందారు. మృతుడు చౌదరిగూడ ఎస్‌బీఐలో బీమా చేయడంతో బ్యాంకు వారు అతడికి రూ.10 లక్షలు మంజూరు చేశారు. ఈ సందర్భంగా వికారాబాద్ ఎస్‌బీఐ రీజినల్ చీఫ్ మేనేజర్ నరేంద్రనాథ్ రెడ్డి మృతుడి భార్య లక్ష్మికి రూ.10లక్షల చెక్కును అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ బీమా చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీఐ ఏరియా మేనేజర్ సాయిరాం, బ్రాంచ్ మేనేజర్ భారతి పాల్గొన్నారు.